# కొద్దివాడు; పెద్దవాడు

ఆవూళ్ళో వొక కొద్దివాడూ పెద్దవాడూ వున్నారు. కావటాని
ఇద్దరిదీ వొకే వూరయినప్పటికీ వాళ్ళిద్దరూ ఎప్పుడూ కలుసుకోలేదు. అయిన
పెద్దవాడితోటి కొద్దివాడికి కావలసిన పను లేముంటాయి గనక? ఉన్నా పె
వాడు వీడికి ఆ పనులు నెరవేర్చిపెడతాడని నమ్మటానికి వీల్లేదు. ఎందుకం
ఆ పనులు నెరవేర్చినందువల్ల కొద్దివాడినుండి పెద్దవాడికి ఆట్టే 'లాభ
సంక్రమించకపోవొచ్చు మరి—

కొద్దివాడి జీవితం రానురాను సుడిగుండాల్లో ఇరుక్కుపోసాగిం
వాడి భార్య, పిల్లలు, చుట్టాలు, స్నేహితులు, ఆత్మీయులు అంతా ఈ సు
గుండాలకి ఒక్కొక్కరే ఆహుతి అయేటట్టుగా వున్నారు. మొత్తంమీ
వాడిఛాయలు, సంబంధంగల ప్రతిదీ ఏదో తెలియని పతనానికీ, నాశనా
గురికాజొచ్చింది.

దీనికి, తనఎదుటనే చెక్కుచెదరకుండా నిర్భయంగా, క్షేమంగా కా
గడుపుతున్న పెద్దవాడు తనకేమన్నా సాయం చేస్తాడేమోనని అతని ద
కెళ్ళాడు.

కొంచెంసేపు వసారాలో ఆగి విచారించాడు. తనవొళ్ళు గిల్లుకొ
చూచాడు. కళ్ళు ఎరుపెక్కేటట్టుచూశాడు. ఎందుకంటే వాడి
ఇల్లలేదు. కొద్దివాడు లోగడ చూచినవన్నీ చిన్న ఇళ్ళే. కావటానికి
యిల్లుగూడా చిన్నదే మరి. అయితేనేం మామూలు యిళ్ళకూ ఈయిం
ఛస్తే పోలికలేదు. అందుకే వాడు గిల్లుకొని కళ్ళు నులుముకొని చూడా
సొచ్చింది అది కలగాదని తనకుతాను నిరూపించుకోనేదానికి.

కొద్దివాడికి ఆయింటోకి పోవడానికి ఎందుకో భయంవేసింది. వెనకు
తిరిగిపోదామని మళ్ళాడు గూడాను. అయినా వాడు తనపనిని తీర్చు
కుండా పోలేకపోయినాడు. పిరికిపడుతున్న గుండెకు ధైర్యం చెపుకొంట
పెద్దవాడిదగ్గరకు చేరాడు. ఇంకా నయం, చేరుకోగలిగాడు. అంద
వాణ్ని అభినందించితీరాలిసిందే.

కొద్దివాడు వొచ్చేటప్పటికి పెద్దవాడు గదిలో డ్రాయరుముందు కూచుని వుత్తరాలకట్ట విప్పుతున్నాడు. ఆ దృశ్యంచూసిన తరవాత కొద్ది వాడు కొద్దిగా వొణికాడు. ఎందుకనో తెలీదుగానీ తను పెద్దవాడిదగ్గర కొద్దిసేపుకంటే ఎక్కువ వుండగూడదనీ, వుంటే తనకు పెద్ద అపాయం ఏదో తప్పక వచ్చితీరుతుందనీ, వాడికి అనిపించింది. ఈ పెద్దవాడిదగ్గరకు రాకుండా వుండాలిసిం దనిపించింది. ఒచ్చిన చిక్కేమిటంటే కొద్దివాడికి ఈ పెద్దవాడినుండి మాత్రమే కాగలపని ఒకటుంది.

పెద్దవాడు వీడికి కుర్చీచూపి కూచోమన్నాడు. వాడు భయపడి కూచోలేదు. అయితే కూచోకుండానూ వుండలేదు. కూచునీ కూచోనట్లు అంటీ అంటనట్లు ఏక్షణాన్నయినా పరిగెత్తడానికి అనువుగావుండే వాలులో కూచున్నాడు. నిజంగా పిచ్చెక్కేస్థితి దాపరించింది. అందులో పెద్దవాడు ఏదో వెదుకుతున్న పోజులో కన్నార్పకుండా చూస్తున్నాడు. కొద్దివాడు ఆచూపులు భరించలేకపోయినాడు. కళ్ళు దించుకోవాలిసొచ్చింది పాపం!

పది నిముషాలు పెద్దవాడు కొద్దివాడివైపు చూశాడు. కొద్దివాడి పని కొద్దిసేపట్లో తేల్చిపారేద్దామని పెద్దవాడు కొంచెంకాలం వాడికి ప్రత్యే కించాడు. దురదృష్టవశాత్తూ కొద్దివాడు దాన్ని వినియోగించుకోలేక పోయినాడు.

రాబోయ్యేముందు కొద్దివాడు పెద్దవాడితో మాట్లాడవలసిన మాటలూ, విధానమూ వొకటికి నాలుగుదఫాలు రిహార్సు చేసుకొనే చేసుకొన్నాడు. అయితే పాపం అంతశ్రమా పెద్దవాణ్ని చూసేటప్పటికి పనికిరాకుండా పోయింది. చివరికి వాడి నోటినుండి మాటరావటమే బ్రహ్మాండమైంది. పెద్దవాడితో మాట్లాడటానికి, కనీసం పెద్దవాడికి సమీపంలో కూచుండే యోగ్యతకూడా తనకులేదని వాడు నమ్మకంగా నిర్ణయించుకొన్నాడు. తానెవరో తెలియక పెద్దవాడు తన్నుగురించి పెద్దగా అనుకొంటున్నా డేమోననే అభిప్రాయం వాడికి చప్పునకలిగింది. పోనీ దీన్నయినా చెప్ప డానికి నోరు పెగిలిచావదుగదా కర్మం!

“కాఫీ తాగుతారా?” అన్నాడు పెద్దవాడు.

నిజానికి వాడికి బాగా ఆకలిగావుంది. ఆ సమయాన వాడికి కాఫీ అవసరం ఎంతయినావుంది. అయినా తన అవసరాన్ని బైటపెట్ట దలచుకోలేదు. అంతతొరలో బైటపడటం మర్యాదలక్షణం గాదని ఎప్పుడో నేర్చుకొన్నాడు.

వీ టన్నిటిమాట కేంగానీ కొద్దివాణ్ని మరీ దిగ్భ్రాంతుణ్ని చేసిందల్లా పెద్దవాడు తనమీదవాడిన మర్యాదసూచిత వాచకం. మొదట్లో అనుకొన్నదేమిటంటే, అసలు పెద్దవాడు తనతో మాట్లాడతాడా? పోనీ తనవేపన్నా చూస్తాడా? అని చూశాడు. మాట్లాడటానికి ప్రయత్నించాడు, చివరికి మాట్లాడాడుగూడా. తనే మాట్లాడలేకపొయ్యాడు.

కుర్రాడు తెచ్చిన కాఫీని పెద్దవాడు తాగి ప్లాస్కు ముందుకునెట్టాడు. తనకు కాఫీ నిజంగా అవసరమనే విషయం ఈ పెద్దవాడు కనిపెట్టిచచ్చాడా ఏమిటి కొంపతీసి? పెద్దవాళ్ళకు ముఖ కవళికలనుబట్టి మనిషి తత్వాలను తెలుసుకోగల సూత్రాలు తెలుసుగావును? లేకపోతే ఇంచాక తను వొద్దని చెప్పినా ఇప్పుడు మళ్ళీ ఫ్లాస్కు తనవేపుకి నెట్టడం ఎందుకు జరుగుతుంది?

పెద్దవాడు కాఫీ తాగి వక్కచూరపొట్టంచించి కొద్దిగా వేసుకొని, సిగరెట్టు ముట్టించాడు. పెద్దవాడు విచిత్రమైన మనిషిగా కనిపించాడు. —తనయితే వక్కచూరపొట్లాన్ని చించి, వేసుకొని, ఛస్తే అట్లా పైనబెట్టడు. చొక్కాజోబీలో వేసుకొంటాడు. కాకపోతే బొడ్లో దోపుకొంటాడు. పైనుంటే ఎవరయినా అడిగితే తప్పనిసరిగా పెట్టాలిసొస్తుంది. దాచుకొంటే ఏ చిక్కూవుండదు. అథవా ఎవరన్నా తెగించిఅడిగితే "నాదగ్గిర లేదు" అని చెప్పొచ్చు. కనీసం యిట్లాంటి చిన్నచిన్న విషయాలుగూడా ఈపెద్దవాడికి తెలియవేమిటా అని విస్తుపొయ్యాడు. లోపల—లోలోపల నవ్వుకొన్నాడు.

కొద్దివాడికి సిగరెట్టు తాగాలనిపించింది. సిగరెట్టుపెట్టె డ్రాయరు మీదనే వుంది. హాయిగా వొక సిగరెట్టుతీసి వెలిగించుకోవొచ్చు. కానీ ఆపాటిధైర్యం నిలువునా లేదు. జోబీ అంతా వెతికాడు. సగంతాగి ఆర్పి దాచిపెట్టుకొన్న బీడీ తగిలింది చేతికి. ఏముఖంబెట్టుకొని పెద్దవాడిముందు ఈ ఎంగిలిబీడీ కాల్చటం? అసలు తను పెద్దవాడిముందు బీడీ కాల్చటమేమిటి?

పోనీ సిగిరెట్టయితే మాత్రం......? అట్లా తాగటానికి పెద్దహక్కు లేవో వుండాలని కొద్దివాడు అంచనావేశాడు. అప్పటికీ వుండబట్టలేక వొకటి రెండుసార్లు డ్రాయరు మీదికి చెయ్యిపోనిచ్చి పెద్దవాడిముఖంవైపు ఆతురతగా చూశాడు—ఫలితాలకోసం. ఆసించిన ఫీలింగ్సేవీ పెద్దవాడి ముఖంలో లేవు. పెద్దవాడు ఏమీఎరగనట్టుగా మామూలుగా తన వుత్తరాలేమిటో చూసుకొంటున్నాడు.

ఒకసారి తెగించి కొద్దివాడు సిగరెట్టుపెట్టెదాపులోకి చేతిని పోనిచ్చాడు. అదేఫోర్సులో చేతిని నాలుగంగుళాలు పోనిచ్చినట్లయితే సిగరెట్టుపెట్టె అందేది. తెలియకుండానే వాడిచెయ్యి వెనక్కు వచ్చేసింది. అట్లా వచ్చినందుకు వాడు సిగ్గుపడవలసింది. కాకపోగా తన్నుతాను అభినందించుకొన్నాడు. ఇంకొకసారి సరాసరి పెట్టెమీదికి చేతిని పోనిచ్చి వేళ్ళతో పెట్టెను పట్టుకొన్నాడు. అయితే పాపం సిగరెట్టు తీసుకోలేకపోయాడు, అట్లా వూరకే సిగరెట్టుపెట్టె పట్టుకొనివుంటే బాగుండదని— తనలో ఏమీలేనట్టు మామూలుగా, పెట్టెను అటూఇటూ తిప్పాడు, తిరగాబోర్లా వేశాడు.నిలువుగానూ, అడ్డంగానూ నిలుచోబెట్టాడు. ఇంతహైరానపడి అరఘంటకాలం ఖర్చుపెట్టిన తరువాతగానీ కొద్దివాడు పెద్దవాడికి సంబంధించిన సిగరెట్టును ముట్టించలేకపొయ్యాడు. అప్పటికీ పెద్దవాడు యేమన్నా అనుకొంటాడేమోనని లోపల పిరికిపడుతూనే వున్నాడు.

పెద్దవాడు ఏమీ అనలేదు. "ఇదిగో వక్కచూర వేసుకోండి" అన్నాడు పైగా పొట్లాన్ని ముందుకుపెట్టి. పెద్దవాడు వట్టి తెలివితక్కువవాడికిమల్లే కొద్దివాడికి కనిపించాడు. ఆసమయాన డబ్బువిలువ పెద్దవాడికి చింతాకంతయినా తెలీదని కొద్దివాడు నిర్ణయించిపాశేశాడు. ఏం అంతంత ఖరీదుగల సిగరెట్టు తాగకపోతే? బీడీలు కాల్చరాదూ? పోనీ చేర్సు కాల్చరాదూ? బంగారమల్లే వుంటయ్యి చేర్సు—వాటికేం?

"ఏం పనిమీద వచ్చారండీ?" అన్నాడు పెద్దవాడు. కొద్దివాడు వణుకును తొక్కిపెడుతూ ముఖంమీదికి ప్రశాంతత తెచ్చుకోవాలని ప్రయత్నించి వెధవముఖంవేశాడు. తనలోని ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సును దాచుకోలేకపోయాడు.

"ఆఁ...ఏమీ లే...దం...డీ! ...వూ...రికే చూద్దా...మని"

ఇప్పటికే కొద్దివాడిచొక్కా కొద్దిగా తడిసింది చెమటతో. నరాలు ప్రయత్నంలేకుండానే వణికేనై. కొంచెం దగ్గి బాగా మాట్లాడాలని ప్రయత్నించాడు. అయితే అది ప్రయత్నంగానే వుండిపోయింది. కార్యరూపం దాల్చలేదు.

కొద్దివాడికి అక్కడ వూపిరిసలపలేదు. వాడికి కావలసిన గాలి అక్కడ లేనేలేదు. తనపని చాలా ముఖ్యమయిందే కావొచ్చు. అది ఈ పెద్దవాడివల్లనే జరగవలసి వున్నప్పటికీ—తను వచ్చిన పనేమిటో పెద్దవాడికి చెప్పలేదు. చెప్పగల తాహతులేదు మరి—

"వస్తానండీ...నమస్కారం"

కొద్దివాడు పెద్దవాడికి దణ్ణంబెట్టి బైటికి వచ్చేశాడు. ఇంటి ఆవరణ దాటినతరవాత వొక్కసారి ముక్కులనిండుగా గాలిపీల్చి వొదిలి తేలికపడ్డవాడయినాడు.

—o—